క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి పాటుపడదాం


మాట్లాడుతున్న ఎంపీపీ బొంబాయి ఉమాదేవి

యాడికి: అన్ని శాఖల సమన్వయంతో గ్రామాభివృద్ధికి పాటుపడదామని ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ సమావేశ భవనంతో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం అధికారులు నిర్వహించారు. ముందుగా గత మూడు నెలల నుంచి మండలంలో చేసిన అభివృద్ధిని ఆయా శాఖల అధికారులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీర్రాజు, వైస్ ఎంపీపీలు హసీనాభేగం, చెన్నప్ప , ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వర రెడ్డి, వైద్యాధికారి పరమేశ్వర్, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి కోట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి


గుత్తి కోట క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న రీజనల్ డైరెక్టర్ మునితర్నంరెడ్డి

గుత్తి: గుత్తి కోట అభివృద్ధికి నిధులు కేటాయించాలని భారతీయ పురావస్తు శాఖ సౌత్ ఇండియా రీజనల్ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ విన్నవించారు. మైసూరులోని సౌత్ ఇండియా కార్యాలయంలో శుక్రవారం ఆయన మునిరత్నం రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా గుత్తి కోట క్యాలెండర్లను ఆవిష్కరించారు. గుత్తి కోట జంగిల్ క్లియరెన్స్‌కు వెంటనే నిధులు కేటాయించాలని విన్నవించారు. అలాగే కోట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు మునిరత్నం రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు విజయ భాస్కర్ తెలిపారు.

జాతర ప్రశాంతంగా చేసుకోండి


కల్లుమడి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ కౌలుట్లయ్య

శింగనమల: గ్రామంలో జాతరను ప్రశాంతంగా చేసుకోవాలని సీఐ కౌలుట్లయ్య సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కల్లుమడి గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. గ్రామంలో అందరు కలసి ప్రశాంతంగా జాతర జరుపుకోవాలని, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఏమైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకరావాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చితంబరయ్య పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామసుబ్బయ్య

పెద్దవడుగూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని యాడికి రూరల్ సీఐ రామసుబ్బయ్య, ఎంవీఐ రాజ బాబు, ఎస్ఐ ఆంజనేయులు సూచించారు. శుక్రవారం మండలంలోని కాశేపల్లి టోల్ ప్లాజా వద్ద హెల్మెట్ వినియోగంపై కళా బృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటిలో హెల్మెట్ లేక తలకు గాయాలై మరణించిన వారి సంఖ్య అధికమన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

26న సంగీత విభావరి

తాడిపత్రి అర్బన్: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు దివ్యస్మృతికి నీరాజనంగా ఈ నెల 26న పట్టణంలోని యల్లనూరు రోడ్డులోని శ్రీవాణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించనున్నట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ ఎం.గంగాధర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 5గంటలకు హైదరాబాద్‌కు చెందిన సినీగాయకులు జాతీయ అవార్డు గ్రహీత చంద్రతేజ బృందంచే కచేరి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి సంగీత అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

హో..రన్!



- భీతిగొలుపుతున్న వింత హారన్లు
- పెరుగుతున్న ధ్వని కాలుష్యం
- ఆందోళనలో పట్టణవాసులు


తాడిపత్రిలో బుల్లెట్‌కు అమర్చిన పెద్ద హారన్

తాడిపత్రి అర్బన్: వింత హారన్ల మోతతో పట్టణం హోరెత్తిపోతోంది. ఉరుకులు పరుగులతో తొందరగా గమ్యం చేరుకోవాలన్న ఆత్రుతతో అవసరం ఉన్నా...లేకపోయినా హారన్ మోగించడం వాహనదారులకు అలవాటైపోయింది. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాలు, అధిక స్థాయిలో శబ్దాలు చేసే హారన్లతో ధ్వని కాలుష్యం రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మోటారు బైక్‌ల హారన్లు, సైలెన్సర్ల నుంచి వెలువడే పెద్ద పెద్ద శబ్దాలు జనం గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. యువత బైక్‌ల సైలెన్సర్లను ఆధునీకరించి పెద్ద శబ్దంతో మితిమీరిన వేగంతో రోడ్లపై దూసుకుపోతున్నారు. అత్యధికంగా బుల్లెట్ వాహనాల సైలెన్సర్ల రూపురేఖలు మార్చి శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారు. ఈ శబ్దాలతో చిన్న పిల్లలు, వృద్ధులు భయపడుతున్నారు. రద్దీగా ఉన్న పుట్లూరు రోడ్డు, యల్లనూరు రోడ్డు, నవరంగ్ టాకీస్ రోడ్డులలో యువత చేసే బైక్ విన్యాసాలకు పోలీసులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యాలయాల వద్ద యువత హల్‌చల్

యువత ఎక్కువగా కళాశాలలు, కోచింగ్ సెంటర్లు నిర్వహించే ప్రాంతాల్లో స్పోర్ట్స్, బైక్‌లతో హల్‌చల్ చేస్తున్నారు. క్రిష్టాపురం జీరో రోడ్డు, సీబీ రోడ్డు, పుట్లూరు రోడ్డు, యల్లనూరు రోడ్డు, మెయిన్ బజార్, గాంధీకట్ట, చింతల వెంకటరమణస్వామి ఆలయం ఏరియా, పోలీస్ స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రయ్..రయ్..మంటూ పెద్ద పెద్ద...శబ్దాలు చేసుకుంటూ యువత బైక్‌లలో వెళుతున్నారు. ఆయా సెంటర్లలో దూసుకుపోతున్నారు. యువకులు అమ్మాయిలను ఆకర్షించేందుకు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని, పెద్ద శబ్దాల మోత తమ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తోందని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.

సాధనాల కొరత

హారన్‌లు, సైలెన్సర్ నుంచి విడుదల అవుతున్న శబ్ద తీవ్రతను కొలవడానికి సాధనాలు అందుబాటులో లేవు. ట్రాఫిక్, రవాణా విభాగాల్లో డెసిబుల్స్ గుర్తించడానికి కొలవడానికి అవకాశం లేదు. దీంతో యువత వివిధ రకాల శబ్దాలతో కూడిన హారన్‌లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

కేంద్ర మోటార్ వాహనాల చట్టంలో వాహనాల హారన్‌ల శబ్దం ఎన్ని డెసిబుల్స్ ఉండాలనే నిబంధనను పొందుపరిచారు. మోటారు బైక్‌లకు 80 డెసిబుల్స్. కార్లకు 82, ప్యాసింజర్ లేదా నాలుగు టన్నుల లోపు తేలికపాటి వాహనాలకు 86, 12 టన్నుల సామర్థ్యం కలిగిన వాహనాలకు 88, అంతకుపై బడిన భారీ వాహనాలకు 91 డెసిబుల్స్ హారన్ ఉండాలి. అంతకు మించిన డెసిబుల్స్ హారన్‌లు వినియోగించడం చట్ట విరుద్ధం. మల్టీ టైప్ హారన్‌ల వినియోగం నిషేధం. నిబంధనలు అతిక్రమిస్తే 108 జీఓ ప్రకారం రూ.వెయ్యి అపరాధ రుసుం విధిస్తారు. పట్టణంలో యువత వినియోగిస్తున్న బైక్‌ల హారన్లు 100 పైగా డెసిబుల్స్ ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ధ్వని కాలుష్యం పెరుగుతోంది



పట్టణంలో రోజు రోజుకూ ధ్వని కాలుష్యం పెరుగుతోంది. యువత బైక్‌లకు పెద్ద పెద్ద శబ్దాలు చేసే హారన్లు వాడుతున్నారు. ఈ హారన్ల కారణంగా వృద్ధులు, పిల్లలు భయపడుతున్నారు. పోలీసులు దృష్టి సారించి పెద్ద శబ్దం చేసే హారన్లను తొలగించాలి.

– శివరామక్రిష్ణ, న్యాయవాది

పోలీసులు కట్టడి చేయాలి



పట్టణంలో యువకులు హారన్లు, సైలెన్సర్లు తీసేసి పెద్ద శబ్దాలు చేసుకుంటూ బైక్‌లపై వెళుతుండడంతో ధ్వని కాలుష్యం పెరుగుతోంది. పట్టణ వాసులు వినికిడి సమస్యల బారిన పడుతున్నారు. విద్యాసంస్థలు, ఆసుపత్రుల వద్ద హారన్ మోగించకుండా పోలీసులు కట్టడి చేయాలి.

– చంద్ర, వ్యాపారి,



నియంత్రణకు చర్యలు చేపడతాం



పట్టణంలోని పలు ప్రాంతాల్లో యువత బైక్‌లకు సైలెన్సర్లు తీసేసి తిరుగుతుండడం, పెద్ద పెద్ద శబ్దాలు చేసే హారన్లను వినియోగిస్తుండడం మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం మా వద్ద డెసిబుల్స్ కొలిచే పరికరాలు లేవు. బైక్‌లను తనిఖీ చేసి ధ్వని కాలుష్యం నియంత్రణకు చర్యలు చేపడతాం. – సాయిప్రసాద్, అర్బన్ సీఐ, తాడిపత్రి

స్వీయరక్షణపై అవగాహన కలిగి ఉండాలి


గుత్తిలోని ఏపీ బాలికల పాఠశాలలో బాలికలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పీడీ వనజా అక్కమ్మ


శింగనమలలో పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


పెద్దవడుగూరులో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో బాలికలు

గుత్తి/శింగనమల/పెద్దవడుగూరు/గార్లదిన్నె: స్వీయ రక్షణ నైపుణ్యాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ సూచించారు. గుత్తి పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం సందర్భంగా స్వీయరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పీడీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు స్వీయ రక్షణ నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్ అంటే ఏమిటో వివరించారు. అనంతరం కరాటే మాస్టర్ల చేత స్వీయ రక్షణ ఎలా చేసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో 1098 జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణమాచారి, డీసీపీఓ మంజునాథ్, పీఓ ఐసీ వెంకటేశ్వరి, ఓఆర్‌డబ్ల్యూ కమలాక్షి, సూపర్‌వైజర్లు నాగేశ్వరి, గౌరీ, కృష్ణవేణి, శ్రీదేవి, కరాటే మాస్టర్లు హరికృష్ణ, యోగానంద్, ప్రిన్సిపాళ్లు ఉషా, విజయ లత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- శింగనమలలోని కేజీబీవీలో బాలికల దినోత్సవం ఘనగా నిర్వహించారు. కార్యక్రమంలో తరిమెల పీహెచ్‌సీ వైద్యురాలు తేజస్విని, సూపర్‌వైజర్ నాగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- పెద్దవడుగూరులోని జెడ్పీ పాఠశాలలో బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసబాబు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మిమాట్లాడుతూ బాలికల పట్ల వివక్ష వీడాలన్నారు. అనంతరం బాలికలకు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణ వేయించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది , అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.
- గార్లదిన్నె మండలంలోని మర్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో లింగ వివక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్య క్రమంలో యర్రగుంట్ల పీహెచ్‌సీ డాక్టర్ దిలీప్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉద్యోగావకాశాలు


విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలు సాధించినప్పుడే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల డైరెక్టర్ పి.గోపాల్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), హిందుస్థాన్ కోకో కోలా బేవరేజెస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో రెండు రోజులు పాటు డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సేల్స్ అండ్ మార్కెటింగ్‌పై నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం శిక్షణ పూర్తి చేసుకున్న 20 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా కోఆర్డినేటర్ శ్రావణి, కోకో కోలా ప్రాజెక్టు మేనేజర్ ఖలీల్‌బాషా, కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్, కళాశాల ఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ బాలగంగాధర్ తిలక్, అధ్యాపకుడు బసెట్టి క్రిష్ణయ్య, పర్యవేక్షకుడు గురు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్ సిస్టమ్ ఆపరేషన్ సక్సెస్


మాట్లాడుతున్న వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రిలో ఓ వ్యక్తికి అరుదైన థైరాయిడ్ సిస్టమ్ ఆపరేషన్‌ను వైద్యులు శుక్రవారం విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆస్పత్రి కమిటీ సభ్యుల సమావేశంలో వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన తిరుమలేసు అనే వ్యక్తి థైరాయిడ్ సమస్యపై స్థానిక ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. స్పందించిన వైద్యుడు కమలాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది గంటల వ్యవధిలో ఆయనకు థైరాయిడ్ సిస్టమ్ ఆపరేషన్ చేశారు. ఇందుకు వైద్యుడు కమలాకర్‌తో పాటు సిబ్బందికి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సీ రాజగోపాల్, లక్ష్మిదేవి, బాధిత కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాతున్న ఎస్సీ,ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప

గార్లదిన్నె: ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య ఘటనలో నారాయణ కళాశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం గార్లదిన్నెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చరణ్‌తేజ్ అనే విద్యార్థి ఫీజు చెల్లించలేక మనస్థాపం చెంది సోములదొడ్డి వద్ద ఉన్న నారాయణ కళాశాల మూడో అంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. విద్యార్థి మృతికి నారాయణ కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. కళాశాల యాజమాన్యం విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కుళ్లాయిస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు


గాయపడిన లోకేష్

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఏడేళ్ల బాలుడు లోకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఆర్ఎస్‌కు చెందిన శంకర్ ఆచారి, లక్ష్మీరత్నం దంపతుల కుమారుడు ఏవీఆర్ స్కూల్ సమీపంలో రోడ్డు దాటుతున్న సమయంలో ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీ కొంది. ఘటనలో గాయపడిన లోకేష్‌ను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కాగా బాలుడిని ఢీ కొన్న ద్విచక్ర వాహనదారుడు ఆప కుండా వెళ్లిపోయాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరు గ్రామానికి చెందిన రైతు ఇల్లూరు సీతారాముడు(49) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. తనకున్న రెండున్నర భూమితో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని సీతారాముడు పత్తి పంట సాగు చేశాడు. ఈ క్రమంలో పంటకు పెట్టుబడికి, కుటుంబ పోషణ కు సుమారుగా రూ.5 లక్షల దాకా అప్పులు చేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడ. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దగ్ధం


మంటల్లో కాలిబూడిదైన ద్విచక్ర వాహనాలు

గుంతకల్లు రూరల్: ఇంటి ఎదుట నిలిపిన రెండు ద్విచక్ర వాహనాలపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఘటనలో రెండు బైక్‌లతో పాటు ఓ సైకిలూ కాలిపోయాయి. వివరాలు... గుంతకల్లులోని సంజీవనగర్ కాలనీలో నివాసముంటున్న చంద్ర, శ్యామలదేవి దంపతులు టైలరింగ్‌తో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం రాత్రి తమ రెండు ద్విచక్ర వాహనాలను ఇంటి ఎదుట నిలిపి లోపల నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై పెట్రోలు పోసి నిప్పంటించి ఉడాయించారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడుతుండడంతో నిద్ర మేల్కొన్న చంద్ర, శ్యామలాదేవి బయటకు వచ్చి చూశారు. అప్పటికే ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న మంటల్లో రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ఓ సైకిల్ కాలిపోతుండడం గమనించి సమాచారం ఇవ్వడంతో కసాపురం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఈ లోపు వాహనాలు కాలి బూడిదయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రస్తా ఆక్రమించారని రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న శ్రీసాయి డిగ్రీ కాలేజీ పక్కన పొలాలకు వెళ్లే రస్తాను వైఎస్సార్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టాడని రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రస్తాను ఆక్రమించడం వల్ల పొలాలకు వెళ్లడానికి వీలు లేకుండా పోయిందని, వెంటనే రస్తాకు దారి వదలాలని వారు డిమాండ్ చేశారు. ఎస్ఐ సురేష్ సిబ్బందితో కలిసి రైతులు ఆందోళన చేస్తున్న ప్రాంతానికి వెళ్లారు. లీగల్‌గా వెళ్లాలని రైతులకు సూచించారు.

పశు వైద్య శిబిరానికి స్పందన

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స,పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు,వ్యాధి నిరోధక టీకాలు వేశా మన్నారు. అనంతరం శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, పశు విజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించారు. వైద్యుడు మాట్లాడుతూ పశు సంరక్షణే లక్ష్యంగా పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

తాడిపత్రిటౌన్: పట్టణంలోని తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆడిటింగ్ డీఆర్ శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కా ర్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ శివనా రాయణ, సీనియర్ అసిస్టెంట్ మంజుల, సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్ మనికంఠ, షరాఫ్ దాదాపీరా, అంటెండర్ రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలానికి హద్దుల ఏర్పాటు

పామిడి: పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ స్థలానికి శుక్రవారం తహసీల్దార్ ఎస్ శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో హద్దులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ స్థల ఆక్రమణకు సంబంధించి సర్వే నిర్వహించారు. ఆర్టీసీ స్థలంలో అక్రమ నిర్మాణ భవనాలకు పంచాయతీ సీసీ రోడ్ల ఏర్పాటుపై దుమారం రేగింది. దీంతో మండల సర్వేయర్ మురళీధర్ సారథ్యంలో అసిస్టెంట్ సర్వేయర్, సచివాలయ సిబ్బంది సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారుల సమక్షంలో ఆర్టీసీ స్థలానికి హద్దులు ఏర్పాటు చేయించారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు

గుంతకల్లుటౌన్: భారత గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు, క్విజ్ పోటీలను నిర్వహించారు. శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో భారత రాజ్యాంగ, భారత గణతంత్ర పరిణామ క్రమం, సంస్కృతి సాంప్రదాయాలపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతను ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవీ చైతన్య, డాక్టర్ గోపినాయక్, డాక్టర్ బాలక్రిష్ణ, వనజమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూపీ స్కూల్‌లో

పామిడి: పట్టణంలోని యూపీ స్కూల్‌లో శుక్రవారం భారత రాజ్యాంగంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిని 8వ తరగతి విద్యార్థిని హేమావతికి ఎంఈఓ జయానాయక్ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పవేణి, శాంతయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

గుంతకల్లు రూరల్: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ విజయకుమార్ సూచించారు. గురువారం మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి టీడీపీ నేత నారాయణస్వామి, అధికారులు హాజరయ్యారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాల్ కందులను రూ.7,550 తో కొనుగోలు చేస్తోందన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే కందులు కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలు చేసిన పది రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

గుంతకల్లు రూరల్: రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రాము రాయల్ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను సగానికి పైగా మార్కెట్లో దళారులకు అమ్ముకున్న తరువాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. అదికూడా కేవలం ఈ క్రాప్ నమోదు చేసిన పంటను మాత్రమే కొనుగోలు చేస్తామని, మిగిలిన పంటను కొనుగోలు చేయమని చెప్పడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి ఈక్రాప్‌తో సంబంధం లేకుండా కందులను కొనుగోలు చేయాలని, అలాగే ప్రతి పంట దిగుబడినీ గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని కోరుతూ ఏఓ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

వీరారెడ్డికి ఘన నివాళి


గుత్తిలో వీరారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి/పెద్దవడుగూరు: గుత్తి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం రైతు సంఘం మాజీ అధ్యక్షుడు, సీపీఎం నాయకుడు జెడ్ వీరారెడ్డి వర్ధంతి కార్యక్రమం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, సీనియర్ నాయకులు రేణుక, రామకృష్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు మండల కేంద్రంలో జెడ్ వీరారెడ్డి సమాధి వద్దకి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు సంఘం సహాయ కార్యదర్శి దస్తగిరి, సీపీఎం నాయకులు ఈశ్వరరెడ్డి, మద్దిలేటి, సుధీర్‌రెడ్డి, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.